# ప్రజాపాలన

డిసెంబర్ 13- 2018
గురువారం
పేజీలు:8

# హైదరాబాద్ ప్లస్

హైదరాబాద్,రంగారెడ్డి,నల్లగొండ,మహబూబ్‌నగర్,ఖమ్మం,ఆదిలాబాద్,నిజామాబాద్,కరీంనగర్,మెదక్,వరంగల్, పెద్దపల్లి


## రాబోయే ఎన్నికలకు సిద్ధమవుతున్నాం

- కూటమి అభ్యర్థులు వీరోచిత పోరాటం చేశారు
- అధికారపక్ష దూకుడును కొంతవరకు అడ్డుకున్నాం
- టీడీపీపై బీజేపీ కుట్రలకు పాల్పడుతోంది



హైదరాబాద్ (ప్రజాపాలన):దేశ రాజకీయాల్లో పెను మార్పులకు తెలంగాణ ప్రజాకూటమి దోహదపడుతుందని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు వీరోచిత పోరాటం చేశారని చెప్పారు. అధికారపక్ష దూకుడును కొంతవరకు అడ్డుకున్నామని తెలిపారు. టీటీడీపీకి రాజకీయాలు కొత్త కాదని అన్నారు. గెలుపు, ఓటములు రాజకీయాల్లో సాధారణమే అని చెప్పారు. రాబోయే ఎన్నికలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీపై బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని, తమను విమర్శించే హక్కు బీజేపీ నేతలకు లేదని అన్నారు. ప్రజాస్వామ్య గొంతుకగా టీడీపీ పని చేస్తుందని తెలిపారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలుపొందిన కేసీఆర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఓడిపోవడం బాధ కలిగించింది...

### ఇందులో టీడీపీ తప్పేం లేదు: జానారెడ్డి

- ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించక పోవడం ఆశ్చర్యం కలిగించింది
- అధికారంలోకి రావాలన్న బలమైన ఆకాంక్ష నెరవేరలేదని ఆవేదన
- టీఆర్ఎస్ అనైతిక పద్ధతుల్లో గెలిచిందన్న కుంతియా



హైదరాబాద్ (ప్రజాపాలన):ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకుని అధికారాన్ని అప్పగిస్తారని భావిస్తే ప్రజలు ఓడించడం కొంత బాధ కలిగించిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. ఆయన విలేరులతో మాట్లాడుతూ ఈ ఓటమికి తెలుగుదేశం పార్టీ చేరికే కారణమన్న వ్యాఖ్యలను ఆయన కొట్టివేశారు. దేశ ప్రయోజనాల ద ృష్ట్యా అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం మేరకు నాలుగు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, కూటమి ఏర్పాటు కారణంగా తప్పు జరిగిందని తాను భావించడం లేదని చెప్పారు.

ఓటమిపై అంశాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అధికారాన్ని నిలబెట్టుకున్న కేసీఆర్ కు, గెలిచిన ఇతర ఎమ్మెల్యేలకు జానారెడ్డి అభినందనలు తెలిపారు. అయితే ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా మాత్రం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ఒకటి రెండు రోజుల ముందు గ్రామాల్లో విచ్చల విడిగా డబ్బు పంపిణీ చేసి కేసీఆర్ అన్యైతిక పద్ధతుల్లో గెలిచారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో వారి వాహనాల్లోనే డబ్బు తరలించారని విమర్శించారు.

## ఎన్నికల కోడ్ ముగిసింది..

- 24 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ మళ్లీ ప్రారంభం: రజత్ కుమార్
- ఫిబ్రవరి 14 వరకు ఓటరు నమోదు ప్రక్రియ
- ఓట్లు ఉన్నాయో, లేదో అందరూ చెక్ చేసుకోవాలి
- 23 లక్షల ఓట్లు గల్లంతయ్యాయనే వార్తల్లో నిజం లేదు



హైదరాబాద్ (ప్రజాపాలన):తెలంగాణలో ఎన్నికల కోడ్ ముగిసిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి రజత్ కుమార్ ప్రకటించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పోలింగ్ ను నిర్వహించామని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 24 నుంచి మళ్లీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 14 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. తమ ఓటు హక్కు ఉందో, లేదో ప్రతి ఒక్కరూ చెక్ చేసుకోవాలని తెలిపారు. ఓటర్ లిస్టులో ఉన్న తప్పిదాలను సరిచేస్తామని చెప్పారు. ఓట్లు పోయిన వారంతా ఆన్ లైన్లో తిరిగి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. 23 లక్షల ఓట్లు గల్లంతయ్యాయనే వార్తల్లో నిజం లేదని చెప్పారు.

## టీఆర్ఎస్‌లోకి చేరికలు మొదలు..

### మద్దతు ప్రకటించిన స్వతంత్ర అభ్యర్థి

- రామగుండం నుంచి ఇండిపెండెంట్ గా గెలిచిన కోరుగంటి చందర్ కేటీఆర్ తో భేటీ
- టీఆర్ఎస్‌కు మద్దతిస్తున్నట్టు ప్రకటన



హైదరాబాద్ (ప్రజాపాలన): రామగుండం నుంచి ఇంటిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన కోరుగంటి చందర్ టీఆర్ఎస్ కు మద్దతిస్తున్నట్టు ప్రకటించారు. ఈరోజు సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు కేటీఆర్ కు తెలిపారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు వరకు తాను టీఆర్ఎస్ లోనే ఉన్నానని తెలిపారు. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ నాయకత్వంలోనే తాను పని చేశానని చెప్పారు. తన మాత ృ సంస్థ టీఆర్ఎస్సేనని అన్నారు.

# నిరంజన్‌రెడ్డికి నీరాజనం పలికిన వనపర్తి

వనపర్తి,ప్రజాపాలన:ముందస్తు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో వనపర్తి నియోజక ప్రజలు తెరాస ఎమ్మెల్యే అభ్యర్థి సింగ్గి నిరం రెడ్డి కి పట్టం కట్టారు. జిల్లా చిట్యాల గ్రామ శివారు లో ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఓట్ల లెకింపు ఉదయం 8 గంటలకు మొదలైయింది.మొత్తం ఇరవై రౌండ్ల ఓట్లు లెకించారు.పదవ రౌండ్ నుండి ఆధిక్యం లోకి వచ్చిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అదే పంతాన ఇరవై రౌండ్ చివరి వరకు కొనసాగించారు.రౌండ్లు ముగిసేసరికి ప్రత్యర్థి (కాంగ్రెస్) చిన్నారెడ్డి పై కాంగ్రెస్ 51,685 ఓట్ల మెజారిటీ తో గెలుపొందారు.జిల్లా ఎన్నికల అధికారి,శ్వేతా మొహంతి,ఆర్ డివో చంద్రా రెడ్డి లు ఎమెల్యేగా గెలుపొందినట్లు ధ్రువీకరన పాత్రలను సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అందజేశారు. అనంతరం సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తనకు గెలుపు అందించిన ప్రజలకు కృత్ఞతలు తెలిపారు.ప్రజలిచ్చిన గెలుపును,పదవిని నియోజక వర్గ ప్రజల కోసమే,నియోజక వర్గ అభివృద్ధి కోసమే పనిచేస్తానని అన్నారు.తనకు ఓట్లు వేయని వారు మరియు ఇతర పార్టీల నాయకులు అభివృద్ధిలో కలిసి రావాలని కోరారు.సామాన్యునికి అందని ద్రాక్ష గ ప్రస్తుత ఎన్నికలు తయారయ్యాయని కాంగ్రెస్ అభ్యర్థి జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.ధనము,ఏరులై పారిన మద్యము,మాంసము ముందు నిజాయితీ గల రాజకీయం నిలవకపోవడం బాధాకరం విమర్శించారు.మొదటగా తెలంగాణ కావాలని,పోరాడింది తానే అన్నారు.ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరిస్తున్నానని తెలిపారు.

# మంత్రి మండలిలో ఎర్రబెల్లికి ఉన్నతమైన స్థానం కల్పించాలి

## జిసిసి చైర్మన్ గాంధీ నాయక్






కొడకండ్ల:- పాలకుర్తి నియోజక వర్గంలో డబుల్ హ్యాట్రిక్ సృష్టించిన ఎర్రబెల్లి దయాకర్ రావుకు మంత్రి మండలిలో ఉన్నతమైన స్థానం కల్పించాలని రాష్ట్ర జిసిసి చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీ నాయక్ అన్నారు.అనంతరం మండల పార్టీ అధ్యక్షులు కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరై వారు మాట్లాడుతూ పాలకుర్తి నియోజక వర్గంలో భారీ మెజార్టీ తో గెలుపొందిన పాలకుర్తి అభివృద్ధి ప్రదాత ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఉన్నతమైన మంత్రి పదవి కల్పించాలని దయాకర్ రావు గెలుపు ప్రజల గెలుపు అన్నారు.దయాకర్ రావు గెలుపు అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు,ముఖ్యనాయకులకు,ప్రతి ఒక్క తెరాస నాయకులకు దయాకర్ రావు తరుపున అభినందలు తెలుపుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాడని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు అమరెందర్ రెడ్డి,జెడ్పిటిసి బాకీ లలిత,మాజీ సర్పంచ్ జక్కుల విజయమ్మ,మాజీ ఎంపిటిసి మధుసూదన్,మాజీ మార్కెట్ చైర్మన్ రామోజీ,దళిత రత్న అందే యాకయ్య,మాజీ ఉప సర్పంచ్ వెంకటనారాయన, వెంకటేశ్వర రావు,మేటి సోమరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటమిని జీర్ణించుకోలేక వేలు నరుక్కున్న వీరాభిమాని



చిట్యాల 12 (ప్రజా పాలన): అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎఫ్ బి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు ఓటమిని జీర్ణించుకోలేక ఓ వీరాభిమాని తన చేతి వేలు నరుక్కున్న సంఘటన భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలం భీమ్మనగర్ లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చిట్యాల మండలం భీమ్మ నగర్ కు చెందిన చిట్ల మల్లేష్ అనే వ్యక్తి గండ్ర సత్యనారాయణరావుకు వీరాభిమాని. కాగా ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుండి గండ్ర సత్యనారాయణరావు ఎమ్మెల్యేగా బరిలో నిలిచారు. గతంలో ఇదే నియోజకవర్గం నుండి టిడిపి, బిజెపి పార్టీల తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగి ఓటమిపాలయ్యారు. ఈ మూడోసారి టిఆర్ఎస్ పార్టీ నుండి టికెట్ ఆశించి భంగపడిన సత్యనారాయణ రావు చివరి సమయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుండి ఎమ్మెల్యే పోటీలో దిగారు. రసవత్తరంగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణా రెడ్డితో పోటీపడి కొద్ది ఓట్లతేడాతో ఓటమిపాలయ్యారు. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా గెలుస్తాడని నమ్మకంతో ఉన్నా, ఓటమి పాలు కావడంతో మల్లేష్ మనస్తాపం తో ఉన్నాడు. ఈ క్రమంలో సత్తన్న మీద ఉన్న అభిమానంతో సత్తన్న టీషర్ట్ వేసుకొని తిరుగుతుండగా కాంగ్రెస్ వాళ్ళు ఇంకా సత్తన్న టీషర్ట్ వేసుకొని తిరుగుతున్నావా అని ఎగతాళి చేయడంతో, సత్తన్నకోసం ప్రాణమయినా ఇస్తా అని మల్లేష్ తన వేలును గొడ్డలితో నరుక్కున్నాడు. సత్తన్న వీరాభిమానిగా ఉన్న మల్లేష్ కు ఓ వైపు ఓటమి, మరో వైపు ఎదుటి వారి వ్యంగమైన మాటలు జీర్ణించుకోలేక ఈ ఘటనకు పాల్పడడంతో గమనించిన స్థానికులు వెంటనే మల్లేష్ ను వైద్యుని దగ్గరికి తీసుకెళ్లి వైద్యం అందించారు. ఈ సంఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# అంబరపేటలో టీఆరెస్ కార్యకర్తల సంబరాలు

అంబర్‌పేట, డిసెంబరు12,ప్రజాపాలన:అంబర్‌పేట నియోజకవర్గంలో టీఆరెస్ నాయకులు,కార్యకర్తల విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి.అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే గా కాలేరు వేంకటేష్ గెలుపొందిన సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని విద్యానగర్,న్యూ నల్లకుంట తదితర ప్రాంతాల్లో మిఠాయిలు పంచి పెట్టారు.ఈకార్యక్రమంలో కట్టెల నర్సింగ్ రావు, మేడి ప్రసాద్ పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు అర్చకుల ఆశీర్వచనం



హైదరాబాద్ : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు యాదాద్రి అర్చకులు ఆశీర్వదించారు. టీఆర్ఎస్ఎల్పీ సమావేశం కోసం తెలంగాణ భవన్‌కు కేసీఆర్ ఇవాళ మధ్యాహ్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్‌కు యాదాద్రి అర్చకులు పట్టు శాలువాతో సన్మానం చేసి ఆశీర్వదించారు. అనంతరం కేసీఆర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కేసీఆర్ వెంట కే కేశవరావు, మహమూద్ అలీ, శేరి సుభాష్ రెడ్డి ఇతరులు ఉన్నారు.

# మొక్కులు చెల్లించుకున్న కేసీఆర్ సతీమణి



హైదరాబాద్ : శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి భారీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సతీమణి శోభా మొక్కులు చెల్లించుకున్నారు. ఇవాళ ఉదయం అమీర్‌పేటలోని కనకదుర్గ అమ్మవారికి కేసీఆర్ సతీమణి శోభా, కుటుంబ సభ్యులు వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ 88 స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే.

# ఇద్దరు నానమ్మలను చంపిన మనుమడు

వికారాబాద్ : పూడూరు మండలం చన్ గోముల్ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. నానమ్మలను వారి మనుమడే హత్య చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. చన్ గోముల్ కు చెందిన శివకుమార్ మంగళవారం తెల్లవారుజామున తన సొంత నానమ్మ బుచ్చమ్మను కొడవలితో నరికి చంపాడు. ఆ తర్వాత చిన్న తాతయ్య భార్య అంతమ్మపై అదే కొడవలితో దాడి చేశాడు. తీవ్రగాయాలతో ఉన్న అంతమ్మను వికారాబాద్ ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మ ృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శివకుమార్ ను చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జగ్గారెడ్డికి ఘన స్వాగతం

ప్రజా పాలన / సదాశివపేట : కాంగ్రెస్ సంగారెడ్డి ఎమ్మెల్యేగా అభ్యర్థిగా గెలిచిన జగ్గారెడ్డికి కాంగ్రెస్ సదాశివపేట మండల కమిటీ పట్టణ కమిటీలు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికాయి ఈ సందర్భంగా జగ్గారెడ్డిని సదాశివపేట పట్టణంలోని పలు కాలనీల్లో భారీ ర్యాలీతో ఊరేగిస్తూ స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శివరాజ్ పాటిల్ మండల పార్టీ అధ్యక్షుడు గడిల రాంరెడ్డి పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ కాంగ్రెస్ నాయకులు జడ్పీటిసి సంగమేశ్వర్ ఎంపిపి లక్ష్మమ్మ వెల్టూర్ మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి కోనాపూర్ ఎంపిటిసి సంగమేశ్వర్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్ పటేల్ బక్కన్న కంది కృష్ణ అవినాష్ తదితరులు భారీగా స్వాగతం పలికారు .ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపించుకోవడం ఎంతో అదృష్టాన్ని ఇచ్చిందని సంగారెడ్డి పట్టణ మరియు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానన్నారు .పేద ప్రజల విజయమే తనకు అండగా ఉందని సంగారెడ్డి నియోజకవర్గ సదాశివపేట పట్టణ మండల ప్రజలు తనను మెజార్టీతో గెలిపించుకున్నారని ఆయన పేర్కొన్నారు ..

## చరిత్ర తిరగరాశారు..




వరంగల్ రూరల్: పోరాటాల గడ్డగా పేరుగాంచిన పరకాల నియోజకవర్గం సంచనాలకు కేంద్ర బిందువు. నియోజకవర్గ ప్రజల తీర్పు 29 యేళ్ల తరువాత మళ్లీ రెండో సారి ఒకే వ్యక్తికి పట్టంకట్టారు. 1952లో ఏర్పడిన పరకాల నియోజకవర్గంలో నాటి నుంచి నేటి వరకు ఇద్దరు ఎమ్మెల్యేలకు మాత్రమే రెండు సార్లు గెలిచే అవకాశం దక్కింది. 2018 ఎన్నికల్లో 46,519 ఓట్ల మెజార్టీతో చల్లా ధర్మారెడ్డి గెలుచి మూడో వ్యక్తిగా నిలిచాడు. 2014లో పరకాల ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డి గెలుపొందారు.

1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బొచ్చు సమ్మయ్య విజయం సాధించారు. 1983లో జరిగిన ఎన్నికల్లో సమ్మయ్య రెండోసారి విజయం సాధించి మంత్రి పదవిని దక్కించుకున్నారు. 1985లో బీజేపీ నుంచి ఒంటేరు జయపాల్ గెలుపొందగా 1989లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి జయపాల్‌ను విజయం వరించింది. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఒక్కొక్కరు ఒకేసారి ప్రాతినిధ్యం వహించగా సమ్మయ్య, జయపాల్, చల్లా ధర్మారెడ్డిలే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

భారీ మెజార్టీ సాధించిన ధర్మారెడ్డి..

పరకాల నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి 46వేల మెజార్టీతో గెలుపొందడం ఇదే తొలి సారి. గతంలో రెండో సారి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో సైతం చల్లా ధర్మారెడ్డికి వచ్చిన మెజార్టీ ఎవరికి రాలేదు. 1989లో 1600, 1985లో 17,132 ఓట్లతో జయపాల్ గెలుపొందారు. 1978లో 8,787, 1983లో 7,295 ఓట్లతో సమ్మయ్య గెలుపొందారు. 2014లో 9,108, 2018లో 46,519 ఓట్ల మెజార్టీతో చల్లా ధర్మారెడ్డి గెలుపొందారు.

పరకాల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు..

పరకాల నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 13 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. 1952లో గోపాల్‌రావు (పీడీఎఫ్), 1957లో కె.ప్రకాష్‌రెడ్డి (కాంగ్రెస్), 1962లో ఆర్.నర్సింహరామయ్య (కాంగ్రెస్), 1967లో సీహెచ్. జంగారెడ్డి (బీజేపీ), 1972లో పి. ధర్మారెడ్డి (కాంగ్రెస్), 1978లో బొచ్చు సమ్మయ్య (కాంగ్రెస్), 1983లో బి.సమ్మయ్య (కాంగ్రెస్), 1985లో ఒంటేరు జయపాల్ (బీజేపీ), 1989లో ఒంటేరు జయపాల్ (బీజేపీ), 1994లో పోతరాజు సారయ్య (సీపీఐ), 1999లో బొజ్జపెల్లి రాజయ్య (టీడీపీ), 2004లో బండారి శారారాణి (టీఆర్ఎస్), 2009లో కొండా సురేఖ (కాంగ్రెస్), 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో మొలుగూరి బిక్షపతి (టీఆర్ఎస్) తరపున గెలిచిన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డి (టీడీపీ), 2018లో చల్లా ధర్మారెడ్డి(టీఆర్ఎస్) విజయం సాధించారు.

# లోక్‌సభకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నార్కట్‌పల్లి (నకిరేకల్) : ఈ ఎన్నికల్లో ప్రజాకూటమి విఫలం విషయమై త్వరలో కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించి భవిష్యత్ ప్రణాళిక నిర్ణయించి పార్లమెంట్ ఎన్నికలకు పక్కా వ్యూహంతో వెళ్తామని మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాల అనంతరం హైదరాబాద్‌కు వెళ్తున్న ఆయన మార్గమధ్యలో నార్కట్‌పల్లిలో గల వివేరా హోటల్‌లో నకిరేకల్ ఎమ్మెల్యేగా గెలిచిన చిరుమర్తి లింగయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నల్లగొడలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓడిపోవడంతో నాయకులు సంబరాలు జరుపుకునేందుకు ఇష్టపడడం లేదన్నారు. నాలుగు నెలల్లో పార్లమెంటు ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోటీ చేసి అధిక మెజార్టీ సాధిస్తారని జోస్యం చెప్పారు. నల్లగొండ నియోజకవర్గంతోపాటు జిల్లా అభివృద్ధికి కృషి చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓడిపోవడం జీర్ణించుకోలేక పోతున్నట్లు వివరించారు. ఒక గ్రామం నుంచి ముగ్గురు ఒకేసారి అసెంబ్లీకి పోవాలనే ఉద్దేశంతో పోటీచేసినట్లు తెలిపారు. ప్రజాతీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. మా గెలుపునకు కృషిచేసిన మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు కార్యకర్తలు, ప్రజాకుటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రసన్నరాజు, మేకల రాజిరెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి, సాగర్ల గోవర్ధన్, చిలువేరు గిరి, యాణాల రాంరెడ్డి, చిన్న మల్లయ్య, కన్నెబోయిన సైదులు, భూపాల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సమద్, వెంకన్న తదితరులు ఉన్నారు,

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను

చౌటుప్పల్ (మునుగోడు) : నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని మునుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన మంగళవారం చౌటుప్పల్‌కు వచ్చారు. స్థానిక తంగడపల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా తన గెలుపుకోసం అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లసింగారం మాజీ సర్పంచ్ సుర్వి నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల వెంకట్‌రెడ్డి, నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, తిరుపతి రవీందర్, తీగుళ్ల కృష్ణ, ఎస్‌కె.జానిబాబు, తొర్పునూరి నర్సింహ, ముమ్మడి నవీన్, బాతరాజు మల్లేశ్, పల్చం సత్యం, పెద్దగోని రమేష్, మునుకుంట్ల శేఖర్, వెంకటేశం, చెరుకు యాదయ్య, మల్లేశ్, రమేష్, కృష్ణ, నరేష్, ఎస్.వెంకటేశం తదితరులు ఉన్నారు.

# భావోద్వేగానికిలోనైన కోమటిరెడ్డి



నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూసిన కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. నల్గొండ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచిన ఆయన.. టీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి చేతిలో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కోమటిరెడ్డిని కలిసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన నివాసానికి వచ్చారు. దీంతో భావోద్వేగానికి గురైన ఆయన.. ప్రజాతీర్పును గౌరవిస్తానని పేర్కొన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవే తనకు ముఖ్యమని వ్యాఖ్యానించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ప్రజలకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఉద్వేగానికి లోనయ్యారు.

నల్లగొండను దత్తత తీసుకోండి...ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలకు కోమటిరెడ్డి అభినందనలు తెలిపారు. తన పదవీకాలంలో జిల్లాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఏర్పాటుకు, తాగు- సాగునీటి సమస్యల నివారణకు కృషి చేశాననని.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షించారు. టీఆర్ఎస్ అధినేత, కాబోయే సీఎం కేసీఆర్ నల్లగొండ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి.. కాంగ్రెస్ అధిష్టానం ఎంపీగా టికెట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# అందుకే గవర్నర్‌ను కలిశాం: టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



హైదరాబాద్ : తాజా ఎన్నికల్లో బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న టీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారానికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజ్‌భవన్‌లో గురువారం మధ్యాహ్నం 1.15 గంటలకు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణం స్వీకరించనున్నారని సమాచారం అందుతోంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పలువురు రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి.. పార్టీ శాసనసభాపక్షం తీర్మానం ప్రతులను అందజేశారు. టీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయాన్ని ఆయనకు తెలియజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వినయ్ భాస్కర్, పద్మాదేవేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, కాలె యాదయ్య, రవీంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.టీఆర్ఎస్ శాసనసభాపక్షం తీర్మానం ప్రతులను గవర్నర్‌కు అందజేశామని తెలిపిన ఎమ్మెల్యేలు.. పరిచయం కోసం మాత్రమే గవర్నర్‌ను కలిశామంటూ.. తాము గవర్నర్‌ను కలువడంలో ఎలాంటి ప్రాధాన్యం లేదని చెప్పారు. మరోవైపు కొత్తగా కొలువుదీరనున్న టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరు మంత్రులుగా బాధ్యతలు చేపడతారన్నది ఆసక్తిగా మారింది. కొత్త మంత్రులుగా పలువురు ఎమ్మెల్యేల పేర్లు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో.. వీరు గవర్నర్‌ను కలువడం కూడా ఊహాగానాలకు తావిస్తోంది.

# బుల్లి బుర్రలో... ఎన్ని సమాధానాలో!





ఐదేళ్లంటే పిల్లలు అ, ఆలు నేర్చుకునే వయసు! కానీ ఆ వయసుకే ఏకంగా లుంగీడ్యాన్స్ పాటకు బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్‌తో కలసి స్టెప్పులేశాడు ఈ చంటోడు. అలాగని ఆ బాలుడు డ్యాన్స్‌లో మైఖేల్ జాక్సన్ కాదు కానీ మెమొరీ పవర్‌లో మాత్రం దిట్ట. హర్యానాకు చెందిన 11 ఏళ్ల 'కౌటిల్య పండిట్' ఒక్కసారి విన్నా, చదివినా, చూసినా.. ఇక మర్చిపోవడం అనేది అతనికి తెలియని విద్య. ఈ గూగుల్ బాయ్ డిసెంబర్ 1, 2 తేదీల్లో 'ది కెరీర్ ఉత్సవ్' కార్యక్రమంలో పాల్గొన్నాడు.

చిప్‌ను కంప్యూటర్‌కు అమర్చి అవసరమైన సమాచారం గురించి తెలుసుకుంటాం. గూగుల్‌లో టైప్ చేసి కావలసిన ప్రదేశం, దాని ప్రత్యేకతలు గురించి వెతుకుతాం.. గణితంలో అర్థం కాని సూత్రాలు, సమీకరణాల గురించి పుస్తకాల్లో చదివి అర్థం చేసుకుంటాం..

కానీ 'ఇవన్నీ మీకు మాత్రమే... నాకు నా బ్రెయిన్ చాలు..' అంటాడు కౌటిల్య పండిట్. హర్యానాలోని కర్నల్ జిల్లా కోహెండ్ అతని సొంత ఊరు. అక్కడే అతని తండ్రి సతీష్ శర్మ నడుపుతున్న పాఠశాలలోనే చదువుతున్నాడు. అసాధారణమైన జ్ఞాపకశక్తితో చిన్న వయసులోనే సెలబ్రిటీ అయ్యాడు.

**'మాస్టర్' మైండ్**

ఈ బుజ్జిగాడిని ఎలాంటి ప్రశ్న అయినా అడగటమే ఆలస్యం.. రెప్ప పాటులో సమాధానం రెడీగా ఉంటుంది! అందుకే ఇతణ్ణి 'గూగుల్ బాయ్' అని ముద్దుగా పిలుస్తున్నారు.

ఐదేళ్ల వయసుకే ఇతను ప్రపంచ దేశాల తలసరి ఆదాయం, స్థూల జాతీయ ఉత్పత్తి, రాజకీయాలు, ఆర్థిక రంగం సహా వివిధ అంశాలకు చెందిన గణాంకాలు, వివిధ దేశాల రాజధానులు, పర్యాటక, చారిత్రక ప్రదేశాల గురించిన వివరాలు చెబుతాడు. గణితంలో క్లిష్టమైన ప్రశ్నలకూ జవాబులు చెబుతాడు. అంగారక గ్రహం గురించి అడిగితే దానికి సంబంధించిన తాజా సమాచారాన్ని వివరిస్తాడు. అతను అంత వేగంగా చెబుతోన్న సమాధానాలు విన్నవాళ్లు మాత్రం ఈ బాలుడి మెదడులో ఏదైనా కంప్యూటర్ చిప్ ఉందా? అనుకుంటారు. ప్రపంచ దేశాలకు సంబంధించిన తాజా అంశాలపైన ప్రశ్నలు అడిగినా రకీమని సమాధానాలిస్తాడు.

**ఐదేళ్లకే అమితాబ్‌తో స్టెప్పులు**

పాపులర్ క్విజ్ ప్రోగ్రామ్ 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ప్రోగ్రామ్‌లోనూ బాలల దినోత్సవం సందర్భంగా కౌటిల్య పాల్గొన్నాడు. అప్పుడతని వయసు ఐదేళ్లు. ముద్దుముద్దుగా మెలికలు తిరుగుతూ, కళ్లు నులుముకుంటూ, కుర్చీలో ముందుకూ, వెనుకకూ ఊగుతూ... అతను సమాధానాలు ఇచ్చిన తీరు కూడా వీక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ అడిగిన అన్ని ప్రశ్నలకూ నూటికి నూరుశాతం సరైన సమాధానాలు చెప్పాడు. అమితాబ్ బచ్చన్ కౌటిల్యను ప్రశంసలతో ముంచెత్తాడు. "ఈ షోలో మీతో కలిసి స్టెప్పులు వేయాలనుంది" అని కౌటిల్య, అమితాబ్‌ను అడిగాడు. అమితాబ్ సరే అనడంతో ఆయనతో కలసి 'లుంగీ డ్యాన్స్' పాటకు డ్యాన్స్ చేసి తన ముచ్చట తీర్చుకున్నాడు. సోనీ టీవీ 'ఎంటర్‌టైన్‌మెంట్ కేలియే కుచ్‌భీ కరేగా' కార్యక్రమంలో గెస్ట్‌గా కౌటిల్య పాల్గొన్నాడు.గుర్గావ్‌లో 'క్లీన్ ఎయిర్ ఇండియా' ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.

**బాలమేధావి పై పరిశోధనలు!**

ఏ రంగానికి సంబంధించిన ప్రశ్న అడిగినా సెకండ్లలోనే సమాధానాలు చెపుతుండటంతో శాస్త్రవేత్తల్లోనూ కౌటిల్యపై ఆసక్తి పెరిగింది. అతని అసాధారణ జ్ఞాపకశక్తిని గురించి మరింత లోతుగా తెలుసుకునేందుకు కురుక్షేత్ర యూనివర్సిటీ పరిశోధకులు పరిశోధనలు నిర్వహించారు. పెద్దల్లో ఐక్యూ 85 పాయింట్లు ఉంటే సాధారణ తెలివితేటలు ఉన్నట్టు సైకాలజిస్టులు పరిగణిస్తారు. పదేళ్లు నిండకుండానే కౌటిల్య ఐక్యూ 130 పాయింట్లు ఉందని గుర్తించారు. అయితే నిండా పదేళ్ల వయసు లేని పిల్లల్లో ఇంత ఐక్యూ చాలా అరుదుగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కౌటిల్య పండిట్‌పై జర్మనీ భాషలో రూపొందించిన డాక్యుమెంటరీని అక్కడి టీవీ ఛానెల్లో ప్రసారం చే యగా మంచి ఆదరణ లభించింది. కౌటిల్యకు డ్యాన్స్ చేయడం అంటే చాలా ఇష్టం. యోగా చేస్తాడు. భవిష్యత్తులో పెద్ద ఖగోళ శాస్త్రజ్ఞుడు కావాలనేది ఈ బాలమేధావి కోరిక! నిజం చెప్పాలంటే... సమాధానాలు చెప్పడం కౌటిల్యకు కష్టం కాదు. కానీ కష్టం అంతా అతణ్ణి ప్రశ్నలు అడిగేవాళ్లదే అనిపిస్తుంది.. అతని అపార జ్ఞాపకశక్తిని చూస్తున్నప్పుడు!

**మేధావులకు సరిజోడి!**

'సూపర్ 30' ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులను సైతం కౌటిల్య తన సమాధానాలతో ఆశ్చర్యపరిచాడు. ఖగోళశాస్త్రం లాంటి క్లిష్టమైన సబ్జెక్ట్‌లో సైతం వారు అడిగిన ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలిచ్చి అవాక్కయేలా చేశాడు. అక్కడ ఉన్నవాళ్లంతా అతడి గ్రహణశక్తి, జ్ఞాపకశక్తిని చూసి విస్తుపోయారు. "ఎలాంటి జంకూ లేకుండా కలసిపోయాడు. హిందీ, ఆంగ్ల భాషల్లో సునాయాసంగా నాతో మాట్లాడాడు" అని గణితవేత్త, 'సూపర్ 30' ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ రూపకర్త ఆనంద్‌కుమార్ స్వయంగా చెప్పారు.

**కంప్యూటర్ బ్రెయిన్!**

కౌటిల్య చిన్నతనంలో ఒకసారి వారి కుటుంబం ఆగ్రాలోని తాజ్‌మహల్‌కు వెళ్లింది. అక్కడ ఉన్న బోర్డులను పసి వయసులోనే కౌటిల్య చాలా సులభంగా చదవడం, అర్థం చేసుకోవడాన్ని అతని తండ్రి గుర్తించి, ఆశ్చర్యపోయాడు. ఆ వేసవి సెలవుల్లో సుశీల్ అనే టీచర్ సహాయంతో కౌటిల్యకు అట్లాస్‌ను పరిచయం చేశాడు. ఒక్కసారి దాన్ని చూసి, అందులో ఉన్న అన్ని దేశాలు, రాజధానులు, సముద్రాల పేర్లను కౌటిల్య తిరిగి చెప్పాడు. దాంతో వారంతా షాక్‌కు గురయ్యారు. మళ్లీ కొన్ని రోజుల విరామం తరువాత అడిగినా అతను తిరిగి సరైన సమాధానాలు చెప్పడంతో అతనిలో అసాధారణ జ్ఞాపకశక్తి దాగుందని భావించి, శిక్షణతో కౌటిల్య ప్రతిభకు మరింత సానబెట్టారు. ప్రస్తుతం అతను చండీగఢ్‌లోని భవన్ విద్యాలయలో ఆరో తరగతి చదువుతున్నాడు.

# చిన్ని

## కౌ గర్ల్



గుర్రపు స్వారీ మజానిస్తుంది. గుర్రమెక్కి దాన్ని అలా దౌడు తీయిస్తుంటే ఆ కిక్కే వేరు. కౌ రైడింగ్‌లోనూ అదే కిక్కు ఉందంటూ దూసుకుపోతోంది పద్దెనిమిదేళ్ల సారా సింప్సన్. ఆవుపై ఎక్కి పరుగులెడుతూ అందరికీ భిన్నంగా సాగిపోతోంది ఈ కౌ గర్ల్ ..

బళ్లో పాఠాలు వింటున్నా.. గుళ్లో పూజ చేస్తున్నా.. కొన్ని కలలు వెంటాడుతుంటాయి. ఎప్పుడూ వాటి ధ్యాసే. న్యూజిలాండ్‌కు చెందిన పదకొండేళ్ల చిన్నారి హన్నా సారా సింప్సన్ ఇందుకు మినహాయింపేమీ కాదు. ఆమెకు గుర్రాలన్నా, గుర్రపు స్వారీ చేయడమన్నా ఎంతో ఇష్టం. తన మనసులో మాటను అమ్మానాన్నల ముందుంచింది. 'గుర్రం ధర చాలా ఎక్కువ. అంత డబ్బు మన దగ్గర లేదు' అని తల్లిదండ్రులు సారాకు నచ్చచెప్పారు. స్వారీ చేయాలంటే గుర్రమే కావాలా? వేరే దేనిపై చేయకూడదా? అని తనకు తానే ప్రశ్నించుకుంది సారా. రోజులు గడుస్తున్నాయి కానీ తన కోరిక మాత్రం నెరవేరలేదు. సరదాగా ఓసారి గొర్రెపిల్ల మీద రైడింగ్ చేసి తన ముచ్చట తీర్చుకుంది. అలాగే మరోసారి వాళ్ల ఫామ్‌లో ఉన్న ఆరు నెలల లేగదూడపై స్వారీ చేసింది. చిన్న చిన్న హర్డిల్స్ దాటడమెలా? గోతులు వచ్చినప్పుడు ఎలా నడపాలి? వంటివి నేర్పిస్తూ సారాకు ఆమె అన్న టిమ్ ప్రోత్సాహం అందించాడు. ఇక సారాకు తిరుగులేకుండా పోయింది. గుర్రంలా ఆవును పరుగులు పెట్టించింది. ఎత్తుల్లోంచి దూకించింది. సారా తన ఆవుకు 'లైలాక్' అని పేరు పెట్టుకుంది. ఇద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్‌గా మారిపోయారు. ఏడు సంవత్సరాల నుంచి వారి అనుబంధం కొనసాగుతోంది. ప్రస్తుతం సారా వయసు పద్దెనిమిది. లైలాక్‌కు ఆరేళ్లు.

ఇష్టం... 'లైలాక్‌కు గుట్టలు ఎక్కడం, లోయల్లోకి దిగడం ఇష్టం ఉండదు. పచ్చిక బయళ్లలో ప్రయాణాన్ని బాగా ఆస్వాదిస్తుంది. నీళ్లలో ఈతకొట్టడాన్ని, జంప్ చేయడాన్ని ఎంజాయ్ చేస్తుంది. గుర్రపు స్వారీతో పోల్చుకుంటే కౌ రైడింగ్ చాలా బాగుంటుంది. అలా అని గుర్రంలా వేగంగా పరుగెత్తాలని అనుకోను. లైలాక్‌కు ఇబ్బందిగా కలిగించకుండా నెమ్మదిగా రైడ్ చేస్తాను. లైలాక్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్ ప్రారంభించాను. మేం కలిసి వెళ్లిన ప్రదేశాలతో పాటు, లైలాక్‌పై రైడ్ చేస్తున్న ఫొటోలను అందులో ఉంచాను. మా ఊరు 'ఇన్వర్‌కార్గిల్ ఒక్కసారిగా పాపులర్ అయింది. ఎంతోమంది నా రైడ్ చూడటానికి ఇక్కడకు వస్తున్నారు' అని అంటోంది సారా.

## దారి కనుక్కోండి



## మత్స్యగిరిగుట్ట పై ప్రత్యేక పూజలు



వలిగొండ ప్రజా పాలన:– టిఆర్ఎస్ ప్రభుత్వం రెండవసారి భారీ మెజార్టీతో గెలుపొందిన ని మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం మాజీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ మరియు పైళ్ల శేఖర్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించినందున ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొమ్మ రెడ్డినరేష్ రెడ్డి ,వెంకటేశం,కొత్త నరసింహ జట్ట నరేష్,కొత్త రామచంద్రం, పద్మయ్య తదితరులు పాలుగొన్నారు.

## హెూరాహెూరీ పోరులో జగ్గారెడ్డి విజయకేతనం



సంగారెడ్డి ప్రతినిధి ప్రజాపాలన : సంగారెడ్డి నియోజక వర్గ గెలుపు ప్రజా గెలుపని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు నన్ను గెలిపించినందుకు ప్రతి ఓటరుకు రుణపడి ఉంటానని నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని ఆయన అన్నారు.నియోజకవర్గంలో గతంలో చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చేస్తారనే లక్ష్యంతో నన్ను గెలిపించారని అందుకు ప్రజలకు రుణపడి ఉంటానని తూర్పు జయప్రకాష్ రెడ్డి అన్నారు. కొందరు స్వార్థపరులు ఓడించాలని లక్ష్యంతో ఎన్నో విధాల ప్రజలకు తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని అయినా ప్రజలు నమ్మకుండా ఓటు వేసి గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పరమ పవిత్ర భద్రాద్రి

భద్రాచలం దక్షిణ భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రంలోని పావన గోదావరి తీరాన వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం. మేరువు, మేనకల కుమారుడైన భద్రుడు శ్రీరామచంద్రునికి పరమ భక్తవరేణ్యుడు. అతని తపస్సుకు మెచ్చి శ్రీరాముడు అతనికి ఇచ్చిన వరం ప్రకారం... సీత.. లక్ష్మణ.. ఆంజనేయస్వామి సమేతంగా ఇక్కడ వెలిశారని స్థలపురాణం! ఇక్కడి శ్రీరామచంద్రుడ్ని భక్తులు ప్రేమగా వైకుంఠ రాముడని, చతురుజే రాముడని, భద్రగిరి నారాయణుడని పిలుస్తారు.

క్షేత్ర చరిత్ర/ స్థల పురాణం





భద్రాచలానికి కేవలం పురాణ ప్రాశస్త్యమే కాదు.. ఘనమైన చరిత్ర కూడా ఉంది. 1730 (17వ శతాబ్దం) ప్రాంతంలో... భద్రాచలం సమీపంలోని భద్రిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పోకల దమ్మక్క అనే ఆమె భక్తిశ్రద్ధలతో శ్రీరాముడిని కొలుస్తుండేది. ఆ మహా భక్తురాలి భక్తికి మెచ్చి ఒక రోజు శ్రీరాముడు ఆమెకు కలలో కనిపించాడట! తాను గతంలో ఇచ్చిన వరం ప్రకారం... భద్రగిరిపై ఉన్నానని.. నన్ను మిగతా భక్తులు కూడా సేవించి తరించేలా ఏర్పాట్లు చెయ్యండి.. ఈ కార్యక్రమంలో నీకు మరో పరమభక్తుడు సాయంగా నిలుస్తాడు.. అని ఆదేశించారట! ఆ మేరకు దమ్మక్క గ్రామ పెద్దలందరికీ ఈ విషయం తెలియజేసి.. భద్రగిరిపైకి వెళ్లి స్వామివారు వెలిసిన ప్రాంతాన్ని గుర్తించిందట. ఆపై అక్కడ పందిరి నిర్మించి పండ్లు నైవేద్యంగా సమర్పిస్తూ వచ్చిందట. ప్రతీ సంవత్సరం సీతారాముల కల్యాణం కూడా నిర్వహించేవారని స్థలపురాణం చెబుతుంది.

అనంతరం రామదాసుగా ప్రసిద్ధుడైన కంచర్ల గోపన్న భద్రాచలంలో శ్రీరాముడికి ఇప్పుడున్న బ్రహ్మాండపై ఆలయాన్ని నిర్మించాడు. గోపన్నది ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి గ్రామం. అప్పటి గోల్కొండ ప్రభువు తానీషా కొలువులో మంత్రులుగా పనిచేస్తున్న అక్కన్న, మాదన్నలకు ఈ గోపన్న మేనల్లుడు. మేనమామల సహకారంతో గోపన్న పాల్వంచ తాలుకా తహశీల్దారుగా పదవీబాధ్యతలు చేపట్టాడు. భద్రాచలంలో వెలిసిన శ్రీరాముడి గురించి తెలుసుకున్న ఆయన స్వామివారికి భక్తుడిగా మారుతాడు. ఆపై కబీర్‌దాస్ శిష్యుడైన శ్రీ రామదాసుగా మారిపోతాడు. భద్రాచల రాముడికో మంచి ఆలయం లేకపోవడాన్ని చూసి.. ఎంతో బాధపడతాడు. తాను ప్రజల నుంచి పన్నుగా వసూలు చేసిన సర్కారు డబ్బు ఆరు లక్షల మొహరీలతో తన దైవం.. భద్రాచల శ్రీరామచంద్రుడికి 1674లో ఇప్పుడున్న ఆలయాన్ని కట్టించాడు!

ఈ విషయం నవాబ్ తానీషాకి ఆగ్రహం కలిగించింది. వెంటనే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము జమచేయాలని ఉత్తర్వులు ఇస్తాడు. సొమ్మంతా భద్రాచలం ఆలయ నిర్మాణానికే వినియోగించా... ఇక నా దగ్గరేమీ మిగల్లేదు ప్రభూ.. అని విన్నవిస్తాడు రామదాసు. దీంతో తానీషా రామదాసును గోల్కొండకు రప్పించి.. బందిఖానాలో ఖైదు చేయిస్తాడు. 12 ఏళ్ల పాటు రామదాసు ఆ బందిఖానాలో నానా కష్టాలు అనుభవిస్తాడు. ఆయా సందరాల్లో అతను భద్రాచల శ్రీరాముడికి తన దుస్థితిని మొరపెట్టుకుంటూ ఆర్తితో ఆలపించిన వందలాది కీర్తనలు ఆ తర్వాత ప్రపంచ విఖ్యాతమయ్యాయి. చివరకు రామదాసు ప్రార్థనలు ఫలించి.. శ్రీరాముడు స్వయంగా లక్ష్మణ సమేతంగా వచ్చి.. తానీషాకు బాకీ సొమ్ము 6 లక్షల మొహరీలు చెల్లించి.. రశీదు తీసుకొని మరీ రామదాసును బందిఖానా నుంచి విముక్తం చేశాడట! ఇప్పటికీ అప్పట్లో శ్రీరామదాసు తన ఆరాధ్యదైవమైన శ్రీరాముడితో పాటు.. సీత.. లక్ష్మణస్వాములకు చేయించిన పలు ఆభరణాలు... తానీషాకు శ్రీరాముడు స్వయంగా చెల్లించిన బంగారు మొహరీలు.. ఉత్సవ సామగ్రి.. అప్పటి శాసనాలు.. పరికరాలు ఆలయంలో చూడొచ్చు. సుమారు 35 కి.మీ.ల దూరంలో ఉండే.. పర?శాలలో.. రామాయణ కాలంలో శ్రీరాముడు.. సీత.. లక్ష్మణుడున్న పర?శాల.. రామాయణ గాథకు సంబంధించిన కొన్ని ఘట్టాలుగా ఇక్కడ జరిగాయంటూ పురాణ.. జనశ్రుతి నిదర్శనాలుగా చెప్పుకొనే ఆధారాలు చూడొచ్చు.

ఈ ఆలయంలో శ్రీపాంచరత్ర ఆగమం ప్రకారం స్వామివారికి నిత్యపూజలు.. ప్రత్యేక అర్చనలు, విశేష ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

దర్శనవేళలు

- రోజూ ఉదయం 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు. సుప్రభాత సేవ నిర్వహిస్తారు.
- ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు బాలభోగం నివేదన. ఆపై ఉదయం 8.35 నుంచి 9.30 వరకు సహస్ర నామార్చన.. ఈ పూజలో పాల్గొనేందుకు రూ.100 టిక్కెట్‌పై ఒక్కరు లేదా దంపతులకు అనుమతిస్తారు.
- ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అర్చనలుంటాయి. వీటిల్లో రూ. 150 టిక్కెట్ ద్వారా పాల్గొనవచ్చు.
- ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు మొదలయ్యే స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొనేందుకు రూ. వెయ్యి చెల్లిస్తే.. ఒకరు.. లేదా దంపతులను అనుమతిస్తారు.
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజభోగం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకూ ఆలయాన్ని మూసేస్తారు.
- రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు దర్బార్‌సేవ జరుగుతుంది. 8.30 గంటల నుంచి 9 గంటల వరకు నివేదన. పవళింపు సేవ ఉంటుంది.

ముఖ్యమైన పూజలు

**అభిషేకాలు**

- ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రతిరోజూ భద్రుడి మండపంలో స్వామివారి పాదాలకు అభిషేకం జరుగుతుంది. టిక్కెట్ ధర రూ. 100. ఒక్కరు లేదా దంపతులకు ప్రవేశం. ప్రతి ఆదివారం మూలవరులకు అభిషేకం జరుగుతుంది. ఈ సేవలో పాల్గొనేందుకు రూ. 1100 చెల్లించాలి.
- ప్రతి శుక్రవారం ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు లక్ష్మీతాయరు అమ్మవారికి అభిషేకం చేస్తారు. ఇందులో పాల్గొనేందుకు రూ. 100 చెల్లించాలి. ఒక్కరు లేదా దంపతులకు అనుమతిస్తారు.
- ప్రతి మంగళవారం ఆంజనేయస్వామి వారికి జరిగే అభిషేకంలో పాల్గొనేందుకు రూ. 100 చెల్లిస్తే.. ఒక్కరు లేదా దంపతులను అనుమతిస్తారు.
- ప్రతి శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీయోగానంద లక్ష్మీనరసింహా స్వామివారికి నిర్వహించే అభిషేక సేవలో పాల్గొనేందుకు రూ. 100 చెల్లిస్తే.. ఒక్కరు లేదా దంపతులకు అవకాశమిస్తారు.

శాశ్వత సేవలు

- శరన్నవరాత్రుల్లో 9 రోజులపాటు శ్రీ మద్రామాయణ పారాయణ చేసేందుకు రూ. 10,000.
- (శ్రీరామనవమి మినహా.. మిగతా రోజుల్లో) స్వామివారి శాశ్వత కల్యాణం జరిపించేందుకు... రూ. 10,000.
- శరన్నవరాత్రి, ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో ఒక్కో అలంకారానికి రూ. 10వేలు.

హంస, గరుడ, అశ్వ, సూర్యప్రభ, సేవల శాశ్వత ఉభయదాతలకు... రూ.5,100 (బోయిల ఖర్చు అదనం)

- ఏటా ఒక రోజు శాశ్వత భోగం చెల్లించేందుకు రూ. 1,116, శాశ్వత ఉచిత ప్రసాద వియోగానికి రూ. 1,116
- ఏడాదిలో ఒక్కరోజు శాశ్వత అన్నదానం చేసేందుకు(ఆరుగురికి..) రూ. 1,116.
- భద్రుని కోవెలలో శాశ్వత అభిషేకం(ఏటా ఒక్కరోజు) రూ. 1,000
- (ఏటా ఒక ఏకాదశి రోజున) శాశ్వత లక్ష కుంకుమార్చనకు.. రూ. 2,500
- ఆలయ చుట్టు సేవకు.. రూ. 500.. నిత్య కల్యాణంలో పాల్గొనేందుకు.. రూ. 1000
- వడమాల భోగం: రూ. 200, చక్కెర పొంగలి(కేజీ) భోగంకోసం.. రూ.300, (ఆదివారం) సువర? పుష్పార్చన రూ. 500 చొప్పున చెల్లించాలి.

**వసతి సౌకర్యం**

భద్రాచలం రామాలయ పరిధిలో 10 ఏసీ కాటేజీలున్నాయి. ఒక్కో గదికి రోజుకు రూ. 1500. నాన్ ఏసీ కాటేజీలు 10 ఉన్నాయి. వీటిల్లో ఒక్కో గదికి రోజుకు రూ. 800 చొప్పున చెల్లించాలి.

- కాటేజీలు కాకుండా మరో 46 నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గది ధర రూ. 300
- ఏసీ గదులు 64 అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గదికి రూ. 800 నుంచి రూ. 1100 వరకూ (గిరాకీని బట్టి) చెల్లించాలి.

**రవాణా సౌకర్యం**

హైదరాబాద్‌కు సుమారు 310 కి.మీ.ల దూరంలో వుండే భద్రాచలం దట్టమైన అటవీప్రాంతంలో ఉంటుంది. జిల్లాకేంద్రం ఖమ్మం నుంచి సుమారు 115 కి.మీ.ల దూరముంది. జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ/ ప్రైవేటు బస్సుల్లో ఇక్కడికి చేరుకోవచ్చు. రాజమండ్రి.. విశాఖపట్నం.. విజయవాడ నుంచి నేరుగా బస్సు సౌకర్యముంది. ఖమ్మం వరకూ లేదా సుమారు 35 కి.మీ.ల దూరంలోని భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ (మణుగూరు) వరకూ రైల్లో వచ్చి.. అక్కడి నుంచి బస్సు లేదా కారులో వెళ్లవచ్చు. రాజమండ్రి నుంచి 135 కి.మీ. దూరం ఉంటుంది. రాజమండ్రి నుంచి రెగ్యులర్‌గా గోదావరి పడవలు భద్రాచలం వెళ్తుంటాయి. గోదావరిలో నీటిప్రవాహం బాగుంటే.. నౌకలో.. నదిలో.. పాపికొండలు మీదుగా భద్రాచలం వెళ్లడం జీవితకాలంలో మర్చిపోలేని మధురానుభూతిని అందిస్తుంది.

# మార్పు మంచికే



**భాగవతంలో ఒక కథ మనకు బాగా తెలిసిందే. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన గాథ. యాదవులుందరూ ఇంద్రుని గూర్చి యజ్ఞం చేయాలని సంకల్పించారు. మేఘాలకు అధిపతి ఇంద్రుడు. వర్షాలు సరిగా కురవాలంటే అతని గూర్చి యజ్ఞం చేయాలని అదివరకు ఉన్న ఆచారం ప్రకారం యజ్ఞానికి పూనుకున్నారు. శ్రీకృష్ణుడు వారికి మరోవిధంగా సలహా ఇచ్చాడు. 'భగవంతుడు కేవలం కర్మఫలాన్ని ఇస్తాడు. కర్మచేయని వానికి ఫలం ఇవ్వలేడు. మన ధర్మం, దేవేంద్రుని విధి. మనం కేవలం గోవులకు మంచి ఆహారం పెడదాం. ఆ ఆహారాన్ని ఇస్తున్న గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాం. ఇంద్రుని పేరిట యజ్ఞమెందుకు' అని అన్నాడు. తన పూజలను ఆపేశారని తెలిసిన ఇంద్రుడు ప్రళయకాల మేఘాల్ని పంపాడట. ఆ కుండ పోత వర్షానికి గోకులమంతా మునిగిపోగా.. శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని ఒక చేతితో పైకెత్తి ఏడు రోజులు అలా మోసి పట్టుకున్నాడట. ఇంద్రుడు తన తప్పును గ్రహించడం, శ్రీకృష్ణుడ్ని శరణుజొచ్చడం అన్నది తర్వాతి కథ. ఈ కథ కేవలం కృష్ణలీల అన్నది సాధారణ అవగాహన. కానీ ఆనాటి సమాజంలో యజ్ఞయాగాదుల పట్ల మారుతున్న ఆలోచనల్ని ఈ కథ ప్రతీకాత్మకంగా తెలుపుతుంది.**

భాగవతం మరొకచోట ఇలా అంటుంది. కృతయుగంలో తపస్సు వల్ల, త్రేతాయుగంలో యజ్ఞాల వల్ల, ద్వాపరయుగంలో సేవలు, పూజల వల్ల, కలియుగంలో శ్రీహరిని కీర్తించడం వల్ల మోక్షం లభిస్తుంది (12-3-52). ఉపనిషత్తుల కాలంలో ఆత్మవిచారానికి ప్రాధాన్యం ఉండేది. జ్ఞానంపై శ్రద్ధ క్రమక్రమంగా తగ్గి యజ్ఞాల రూపంలోకి మారింది. శ్రీరాముని కాలంలో యజ్ఞాలను రక్షించడం ధర్మం. ద్వాపరమందు భక్తికి ప్రాధాన్యం. భాగవతమంతా భక్తి వర్ణనే. సమాజంలో వస్తున్న కొత్త భావాలకు అనుగుణంగా మతపరమైన ఆచారాన్ని మార్చడానికి వ్యాసమహర్షి అందించిన కథ ఇది.

భాగవంతలోనే మరొక ఘట్టం కృష్ణుని పట్ల బ్రాహ్మణపత్నుల భక్తి. ఒకరోజు గోపాలురందరూ అడవిలో గోవుల్ని కాస్తున్నారు. ఆ సమయంలో వారికి చాలా ఆకలి వేసింది. ఆహారమెక్కడా దొరకలేదు. దగ్గరలో కొందరు బ్రాహ్మణులు స్వర్గాన్ని పొందాలనే దీక్షతో బృహస్పతి యాగం చేస్తుంటారు. కృష్ణుడు తన స్నేహితుల్ని వారి వద్దకు పంపాడు. యజ్ఞంలో పశుబలి అనే దీక్ష ఉంటే అలాంటివారి ఆహారాన్ని తీసుకోకూడదని చెప్పి పంపాడు. గోపాలురు అలాగే వెళ్లి బలరామకృష్ణులకు ఆకలిగా ఉంది ఆహారమివ్వండి అని అడిగారు. బ్రాహ్మణులు ఏమీ మాట్లాడలేదు. గోపాలురు వెళ్లి ఆ విషయాన్ని కృష్ణుడితో చెప్పారు. కృష్ణుడు గట్టిగా నవ్వి సరే, యజ్ఞపత్నుల దగ్గరకు వెళ్లి అడగండి అన్నాడు. కృష్ణుడు ఆకలిగా ఉన్నాడని తెలియగానే యజ్ఞపత్నులు ఎంతో ఆదుర్దగా వెళ్లి ఆయనకూ, మిగతా గోపాలురకు ఆహారం ఇచ్చారు. యజ్ఞంలో ఉన్నవారు కూడా తమ తప్పు తెలుసుకుని భార్యల్ని ఏమీ అనకుండా యజ్ఞాన్ని ముగిస్తారు. ఈ కథలో కూడా ఆ రోజుల్లో యజ్ఞాల్లో జరిగే పశుహింసను ప్రస్తావించారు. ఇది కూడా సమాజంలో వస్తున్న మార్పునకు అనుగుణంగా వేదవ్యాసుడు భాగవత పురాణం ద్వారా మతవిశ్వాసాల్లో తెచ్చినమార్పు.

సమాజంలోని మార్పులకు అనుగుణంగా అందులోని వ్యవస్థలు ఎప్పటికప్పుడు మార్పు చెందుతుంటాయి. అది కుటుంబ వ్యవస్థ కావచ్చు. మత సిద్ధాంతాలు కావచ్చు. మారడం అనేది ఒక సహజ పరిణామం. ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు, పాత వ్యవస్థపై విమర్శలు వస్తూ ఉంటాయి. ఎంతో ఉదాత్త ఆశయాలతో ప్రారంభమైన వ్యవస్థలు క్రమేణ వ్యక్తుల బలహీనత వల్ల వ్యతిరేకతకు గురవుతాయి. పరిణామక్రమంలో సహజంగా మార్పు రానపుడు అది ఒకానొక విప్లవ రూపంలో కూడా రావచ్చు.

పై కథలాంటిదే మరొకటి శివుని గూర్చి పురాణాల్లో ఉంది. దీనిని తెలుగులో హరవిలాసం అనే కావ్యంలో శ్రీనాథుడు చక్కగా వర్ణించాడు. దారుకావనం అనే చోట రుషులు ఎంతో విద్యాగర్వంతో యజ్ఞం చేస్తున్నారట. శివుడు వారి ఎదుట నగ్నంగా ప్రత్యక్షమయ్యాడు. రుషులు ఆయనపై కోపంతో యుద్ధానికి వెళ్లారు. రుషుల గర్వాన్ని అణచడానికి శివుడు వారిని తీవ్రంగా మర్దించాడట. ఇక్కడ వర్ణన కొంత అశ్లీలంగా కనిపిస్తుంది. కానీ అశ్లీలతను పక్కన ఉంచి కథలో ఉన్న ప్రతీకాత్మక సందేశాన్ని చూస్తే శ్రీకృష్ణుడి కథలో ఉన్న విషయమే ఇక్కడ మరింత తీవ్రంగా చెప్పడాన్ని గమనిస్తాం. కేవలం యాంత్రికంగా యజ్ఞాలు చేయడం అనే విశ్వాసంపై ఆనాటి సమాజంలో వచ్చిన విముఖత ఇక్కడ చూడగలం. విష్ణుభక్తి గూర్చి చెప్పిన పురాణగాథలకు సమాంతరంగా శివభక్తిని ప్రతిపాదిస్తూ చెప్పిన కథ ఇది. భక్తి అన్నదే ఉత్తమ మార్గమనీ, కేవలం కర్మ సరైన మార్గం కాదనీ ఇందులో సారాంశం. పురాణ రచయిత అత్యుత్సాహం వల్ల పాశ్చాత్య విమర్శకులు శివుడ్ని కాముకుడిగా చూపిస్తూ రచనలు చేశారు.

హిందూమతంలో సంస్కరణలు ఆధునిక కాలంలో సాంఘిక ఉద్యమ రూపంలో వచ్చాయి. కానీ ఒకప్పుడు రుషులు పురాణాల ద్వారా, లేదా వేదాల్ని కొత్తకోణంలో వ్యాఖ్యానం చేయడం ద్వారా ఈ మార్పుల్ని తేవడానికి ప్రయత్నించారు. వ్యాసుని భారతం, భాగవతం ఈ రెండూ ఇందుకు ఉదాహరణలు. భగవద్గీతలో అనేక విషయాలపై ఇలాంటి మార్పుల్ని చూడగలం. నాలుగు వర్ణాలూ గుణాలపై ఆధారపడినవని చెప్పడం ఇదివరకు వ్యాసాల్లో చూశాం. యజ్ఞమనే పదానికి కూడా శ్రీకృష్ణుడు విస్తృతమైన అర్థాన్ని చెప్పాడు. యాంత్రికంగా హోమాలు చేయడం, ఆహుతులివ్వడం, పశుబలి లాంటివి కాకుండా సమాజశ్రేయస్సుకు తోడ్పడే పనులు, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, ప్రాణాయామం మొదలైనవన్నీ యజ్ఞం లాంటివే అన్నాడు (నాల్గో అధ్యాయం). అలాగే దేవుడికిచ్చే నైవేద్యం యజ్ఞాల్లోని ఆహుతుల రూపంలో ఉండక్కర్లేదు. పత్రం, పుష్పం, ఫలం, తోయం (నీరు) అనే రీతిలో ఎవరు సమర్పించినా భగవంతుడు స్వీకరిస్తాడు అనే భావాన్ని భగవద్గీతలో చూడగలం. యజ్ఞాల్లో ఒకప్పుడు ఉన్న పశుహింసను వ్యాసుని కాలానికే సంస్కరించడం జరుగగా ప్రస్తుతం షెల్డాన్ పోలాక్ లాంటి విమర్శకులు హిందూ సమాజం హింసాత్మకమైనదంటూ రాయడం కేవలం అసత్య ప్రచారం.

యజ్ఞాలవల్ల సాధించగలిగే స్వర్గమనేది ముఖ్యమైన లక్ష్యం కాదనీ, పిల్లవాడు మందును మింగాలనే కోరికతో తల్లి బెల్లము ఆశగా చూపినట్లు స్వర్గమనే చాక్లెట్టును గూర్చి చెప్పారని భాగవతం చెబుతుంది (11-21-23). గీతపై, ఉపనిషత్తులపై వచ్చిన వ్యాఖ్యానాలన్నీ పై భావాలకు అనుగుణంగా ఉంటాయి. వేదకాలం నాటి అనేక ఆచారాలను సంస్కరించి ఆత్మజ్ఞానాన్ని పొందడమే ముఖ్యలక్ష్యం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి వేదాంతాన్ని సార్వకాలిక మార్గంగా ప్రతిష్టించాయి.

# కొవ్వును కొవ్వుతోనే కరిగించాలి!

## సామాజిక మాధ్యమాల్లో చూసి అనుసరణ





హైదరాబాద్ :ఏం తింటున్నాం.. ఎంత తింటున్నాం.. ఇప్పుడు అందరి దృష్టి తినే ఆహారం మీద పడింది. అది కూడా శాస్త్రీయంగా కాకుండా ఎక్కడో చూసి, ఎవరో చెప్పింది విని అనుసరిస్తున్నారు. అది ఎంత వరకు సరైందనే విషయాలను పట్టించుకోవడం లేదు. దీనికి తోడు సామాజిక మాధ్యమాల్లో చూసి దానినే నమ్మేస్తున్నారు. కొందరు పూర్తిగా పిండి పదార్థాలు మానేద్దాం అనుకుంటారు. మరి కొందరు కొవ్వు పదార్థాలను కనీసం కన్నెత్తి కూడా చూడకూడదనుకుంటారు. ఇలా ఎవరికి తోచింది వాళ్లు చేసేస్తున్నారు. వైద్యుల సలహాలు తీసుకోకుండా ఆహారాన్ని ఇష్టారీతిన ఎంచుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. ఇలాంటి ధోరణి హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నట్లు డాక్ఆన్‌లైన్ సంస్థ చేసిన సర్వేలో తేలింది.

హైదరాబాద్ వంటి నగరంలో జీవన విధానం వైవిధ్యంగా ఉంటుంది. ఉద్యోగాలు ఉరుకులు పరుగుల మధ్య ఎప్పుడు తింటారో తెలియదు. సమయపాలన ఉండదు. వారాంతాలలో మస్తీ చేయాల్సిందే.. ముక్క దిగాల్సిందే. జంక్‌ఫుడ్స్, బిర్యానీ, బేక్డ్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకుంటారు. దీంతో వేగంగా బరువు పెరుగుతున్నారు. ఇలాంటి వారు అంతే వేగంగా బరువు తగ్గాలనుకుంటున్నారు. ఏం తింటే బాగుంటుందని, ఎలాంటి డైట్‌ను అనుసరించాలని సామాజిక మాధ్యమాల్లో వెతికి మరీ పాటిస్తున్నారు. దీంతో కార్బోహైడ్రేట్‌లను తగ్గించి కీటోడైట్‌ను పోలిన విధానాలను అనుసరిస్తున్నారు. కొవ్వులను అధికంగా తీసుకుంటున్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఇలాంటివి పాటిస్తే అనారోగ్యానికి గురవుతారని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి విధానాలను అనుసరిస్తున్న వారిలో పురుషులే ఎక్కువగా ఉన్నారని డాక్ఆన్‌లైన్ సర్వేలో తేలింది. ఈ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు ఆన్‌లైన్‌లో తమకు వచ్చే కేసులను అధ్యయనం చేయగా ఈ విషయం వెలుగు చూసింది. నగరంలో 5వేల సులను అధ్యయనం చేయగా అందులో 3500 మంది పురుషులు, 1500 మంది మహిళలు అధికంగా కొవ్వు ఉండే ఆహారాన్ని తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇలాంటి డైట్‌లు తమ శరీరానికి సరిపోతాయో లేదో అని చూసుకోకుండా అనుసరిస్తున్నారు.

**ఇబ్బందులు ఇవీ...**

కొవ్వును కొవ్వుతోనే కరిగించాలని ఇలాంటి విధానాలను అనుసరిస్తున్నారు. ఒకే సారి పిండిపదార్థాలను తీసుకోవడం ఆపేస్తున్నారు. శరీరానికి తక్షణ శక్తి కావాలంటే కార్బోహైడ్రేట్‌లు అవసరం. వీటిని పూర్తిగా మానేయడం వల్ల శరీరంలో సత్తువ తగ్గిపోతుంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. శరీరం రోజువారీ తీసుకునే ఆహారానికి అలవాటుపడి ఉంటుంది. ఒక్కసారిగా మార్పులు చేయడం వల్ల జీవక్రియల్లో మార్పులు తలెత్తి జీర్ణసంబంధ ఇబ్బందులు తలెత్తుతాయి. తలనొప్పి, నీరసంగా ఉండటం, గొంతు పుల్లగా అయిపోవడం వంటి మార్పులు చోటు చేసుకుంటాయి.

**నెమ్మదిగా తగ్గడమే మేలు**

**- డా.ప్రసూన, కన్సల్టెంట్ ఫిజీషియన్**

పిండిపదార్థాలతో జీవక్రియ తొందరగా జరుగుతుంది. అదే కొవ్వు పదార్థాలు తీసుకుంటే జీర్ణక్రియ జరగడానికి రెండు వారాల సమయం పడుతుంది. తక్షణ శక్తి కోసం శరీర వ్యవస్థలు దేహంలో నిల్వఉన్న పిండిపదార్థాలను కరిగించి శక్తిని విడుదల చేస్తాయి. కొవ్వుల నుంచి ఇలా తక్షణ శక్తి లభించదు. అందువల్ల శరీరం ఈ డైట్‌కు వెంటనే స్పందించదు. దీని వల్ల శరీరంలో గ్లూకోజ్ నిల్వలు తరిగిపోయి తొందరగా అలసిపోతారు. చాలా మందికి అనారోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, ఆరోగ్యమైన కొవ్వు పదార్థాల పట్ల అవగాహన లేదు. దీంతో ఏది పడితే అది తినేస్తున్నారు. వైద్యుల సలహాల మేరకే ఆహారంలో మార్పులు చేసుకోవాలి. వారు పరీక్షించి తట్టుకోగలరా.. లేదా.. అని చూసి సలహాలు, సూచనలు అందజేస్తారు. బరువు వేగంగా తగ్గడం కన్నా ఆరోగ్యకరమైన పద్ధతుల్లో నెమ్మదిగా తగ్గడమే మేలు.



